రెఫరే.. బేజారే


పలమనేరు వంద పడకల ఏరియా ఆస్పత్రి

- ఏరియా ఆస్పత్రిలో నిత్యం రెఫర్ల పర్వమే!
- అందుబాటులోని స్పెషలిస్ట్ వైద్యులు
- జనరల్ మెడిసిన్, సర్జన్ ఉంటేనే తీరనున్న సమస్య
- వైద్యసేవలకు తప్పని ఇక్కట్లు
- పేదవానికి అందని సర్కారు వైద్యం

పలమనేరు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని చూసిన వారెవరైనా వామ్మో ఇంతపెద్ద ఆస్పత్రా, దీన్ని ఎప్పుడు కట్టారబ్బా అని ఆశ్చర్యపోక తప్పదు. అయితే వైద్యుల కొరత, సర్జరీలకు అవసరమైన ఎక్విప్‌మెంట్స్ లేక అత్యవసర రోగులకు రెఫర్లు తప్పడంలేదు. ఇక్కడి ఆస్పత్రికి ఎవరైనా అత్యవసర రోగులు రాగానే డ్యూటీ డాక్టర్ల సమాధానం దీనికి సంబంధించిన పరీక్షలు ఇక్కడ లేవు, స్కానింగ్‌లేదు, డబ్బుంటే వేలూరు సీఎంసీ, లేదా తిరుపతి స్విమ్స్‌కు వెళ్లండి. మేము రెఫర్ లెటర్ రాసేస్తున్నాం, వెళ్లడంటూ తరమడం ఇక్కడ సర్వసాధారణంగా మారింది. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇన్ని కోట్లు పెట్టి ఇంత పెద్ద ఆస్పత్రిని కట్టి రోగులకు అవసరమైన సేవలందకుండా పోతే ప్రభుత్వ లక్ష్యం బూడిదలో పోసిన పన్నీరేననే మాట వినిపిస్తోంది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.16 కోట్లతో ఆస్పత్రి నిర్మాణం

పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 50 పడకలతో ఆస్పత్రిని నిర్మించారు. తరువాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సర్కార్ ఈ ఆస్పత్రి అభివృద్ధిని మరిచింది. ఆపై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు ఈ ఆస్పత్రిని వంద పడకలుగా మార్చి నాడు–నేడు ద్వారా రూ.16 కోట్లతో నిర్మించారు. కొత్త భవనం ఈ ఏడాది మార్చి ఏడున ప్రారంభమై సేవలు అందుబాటులోకి వచ్చాయి.

అత్యవసర రోగులొస్తే వెంటనే రెఫర్

ఈ ప్రాంతంలో ఇదే పెద్ద ఆస్పత్రి. పలమనేరు హైవేపై ఉండడంతో ఎక్కువగా రోడ్డు ప్రమాదాల్లో గాయపడినవారు, సీరియస్ కేసులు రాత్రుల్లో ఇక్కడికి వస్తుంటాయి. అయితే రాత్రుల్లు డ్యూటీలో ఉండే వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి వెంటనే తిరుపతికి రెఫర్ చేసేస్తున్నారు. ఇక ఇక్కడ చేయదగ్గ వైద్యసేవలు సైతం రాత్రుల్లో పెద్దగా పట్టించుకోవడం లేదు. ఇక్కడి రెగ్యులర్ వైద్యులకు రాత్రిపూట సహాయకులుగా ఉండాల్సిన ఐదుగురు పీజీ స్టూడెంట్స్ రాత్రుల్లో కనిపిస్తే ఒట్టు. వీరిని ఉన్నతాధికారులేమైనా అడిగితే వారికి వెంటనే రాజకీయ నేతల నుంచి ఫోన్లు వచ్చేస్తుంటాయి. దీంతో రాత్రుల్లో వీరు ఉన్నా, లేకున్నా ఒక్కటే. దీంతో నర్సులే వైద్యానికి దిక్కుగా మారారు.

ప్రస్తుత స్పెషలిస్ట్ వైద్యులు, సేవలిలా

ఐదుగురు సివిల్ సర్జన్‌ల అవసరం ఉండగా నలుగురున్నారు. డిప్యూటీ సర్జన్‌లు ఇద్దరిలో ఒక్కరే ఉన్నారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్‌లు 14మంది కావాల్సి ఉండగా మరో ముగ్గురి కొరత ఉంది. ఓ థియేటర్ అసిస్టెంట్, డార్క్‌రూమ్ అసిస్టెంట్‌ల అవసరం ఉంది. ఇక్కడి ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది మొత్తం కలిపి 96 మంది కాగా ఇప్పుడు 82మంది ఉన్నారు. అయితే ఆపరేషన్లకు అవసరమైన జనరల్ సర్జన్, జనరల్ మెడిషన్ వైద్యులుంటేనే రెఫర్లు తగ్గే అవకాశం ఉంటుంది. థైరాయిడ్ వైద్యులున్నా, థైరాయిడ్ టెస్టింగ్ మిషిన్ లేదు. ఆర్థో డాక్టర్ ఇటీవల వచ్చినా వైద్యపరికరాలు లేవు. ఆక్సిజన్ ప్లాంట్ ఉన్నా ఆస్పత్రిలో ఆక్సిజన్ సరఫరా అయ్యేందుకు లైనింగ్ సౌకర్యాన్ని ఇంకా ఏర్పాటు చేయలేదు. ఆస్పత్రిలోని మూడు అంతస్తులకు లిఫ్ట్ సేవలు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇవన్నీ అందుబాటులోకి వస్తే తప్ప ఇక్కడి ఆస్పత్రిలో రోగులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందుబాటులోకి రాని పరిస్థితి నెలకొంది.

కొత్త హంగులతో ఆస్పత్రి

గతంలో ఆస్పత్రిలో ఐదు బ్లాకులుండగా అదనంగా మరో ఐదు బ్లాకులతో కొత్త ఆస్పత్రిలో ఏర్పాటైంది. ప్రసూతి, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ఆయుష్ విభాగం, ఐసీటీసీ, క్యాజువాలిటీ, బర్న్స్ యూనిట్, ఐసోలేషన్ వార్డ్, 21 పడకలతో ప్రత్యేక చిన్నపిల్లల విభాగం సహా విభాగాలను ఏర్పాటు చేశారు. 50మందికి సరిపడా ఆక్సిజన్ ప్లాంట్‌ను నిర్మించారు. అయితే అన్నీఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందాన ఆస్పత్రి మారింది.

జనరల్ సర్జన్స్ వస్తేనే అత్యవసర సేవలు



ఈమధ్య కొందరు స్పెషలిస్టులు వచ్చారు. కానీ వారు ఆపరేషన్ చేయడానికి అవసరమైన ఎక్విప్‌మెంట్స్ లేవు. ముఖ్యంగా జనరల్ సర్జరీకి సంబంధించి ఇద్దరు స్పెషలిస్టులు కచ్చితంగా కావాలి. ఎమర్జెన్సీ రోగులకు ఆక్సిజన్ పెట్టేందుకు లైనింగ్‌లేదు. కలెక్టర్ గారికి మేజర్, మైనర్ రిక్వైర్‌మెంట్స్ ఇచ్చాం. ప్రభుత్వం ఈ సౌకర్యాలను కల్పిస్తే రెఫర్‌లు ఉండవు.

–డా.మమతారాణి, ఆస్పత్రి సూపరింటెండెంట్, పలమనేరు

క్లుప్తంగా

జగన్ పుట్టినరోజు వేడుకలు రేపు

కుప్పం: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు శనివారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. శనివారం ఉదయం 10 గంటలకు రామకుప్పం వైఎస్సార్ విగ్రహం వద్ద, 11 గంటలకు శాంతిపురం, 12 గంటలకు కుప్పం, మధ్యాహ్నం 12.30 గంటలకు గుడుపల్లె బస్టాండులో జరిగే జగన్ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్సీ భరత్ పాల్గొంటారని వారు తెలిపారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు తప్పక హాజరు కావాలని కోరారు.

వినియోగంలోకి తేవాలి


నిరుపయోగంగా చెత్త సంపద తయారీ కేంద్రం

సదుం: మండలంలోని గుండ్లూరివారిపల్లె సమీపంలోని చెత్త సంపద తయారీ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. తడి, పొడి చెత్తను సేకరించి వర్మీకం పోస్టు ఎరువు తయారీ చేసేందుకు దీనిని నిర్మించారు. కానీ అధికారులు పట్టించుకోకపోవడంతో పిచ్చి మొక్కలు పెరిగి, మందుబాబులకు అడ్డాగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ముగిసిన శిక్షణ తరగతులు

పుంగనూరు: పట్టణంలోని జెడ్పీ విశ్రాంతి భవనంలో రెండు రోజులుగా జరుగుతున్న మండలస్థాయి శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. డీఎల్‌డీఓ వెంకటశేషయ్య, ఎంపీడీఓ లీలామాధవి శిక్షణ ఇచ్చారు. గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతుల కల్పనపై శిక్షణ కల్పించారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు, ప్రతిఒక్కరూ భాగస్వాములై, పంచాయతీల అభివృద్ధికి కృషిచేయాలని పిలుపునిచ్చారు.

పనుల్లో పెట్టుకుంటే చర్యలు


తనిఖీలు నిర్వహిస్తున్న లేబర్ ఆఫీసర్

సదుం: బాల కార్మికులను పనుల్లో పెట్టుకుంటే చర్యలు తప్పవని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఆనందబాబు హెచ్చరించారు. మండల కేంద్రంలో పలు దుకాణాలు, హోటళ్లలో గురువారం ఆయన తనిఖీలు నిర్వహించారు. బాల కార్మిక నిర్మూలనకు అందరి సహకారం అవసరమని చెప్పారు. గ్రేట్ విజన్ సొసైటీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంబాబు, హెడ్‌కానిస్టేబుల్ అమరనారాయణ, ఎంఈఓ–2 దామోదర, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

అమిత్‌షా తీరు బాధాకరం


చౌడేపల్లెలో ధర్నా చేస్తున్న నేతలు

చౌడేపల్లె: డాక్టర్ అంబేడ్కర్‌పై, కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్‌షా వ్యవహరించిన తీరు బాధాకరమని సీఐటీయూ మండల కార్యదర్శి డాక్టర్ చంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. అమిత్‌షా తీరుకు వ్యతిరేకంగా బస్టాండులో ప్రజాసంఘాలు కలిసి ధర్నా చేసి నిరసన తెలిపాయి. ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళిత సంఘం నేతలు శేఖర్, బ్యాంకు రెడ్డప్ప, వేణు, సురేష్, శంకరప్ప, కుమార్, ముకుంద పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలి


మాట్లాడుతున్న సత్యంరెడ్డి

రొంపిచెర్ల: గ్రామాభివృద్ధిలో సర్పంచులు, సచివాలయ ఉద్యోగులు కీలక పాత్ర పోషించాలని ఈఓఆర్డీ సత్యంరెడ్డి అన్నారు. ఆయన గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచులకు, సచివాలయ ఉద్యోగులకు రెండవ రోజు గ్రామాభివృద్ధిపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్లు శిరీష, ఫయాజ్, కాంతమ్మ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి


మాట్లాడుతున్న జగదీష్ నాయుడు

పులిచెర్ల(కల్లూరు): బీజేపీ బలోపేతానికి కృషిచేద్దామని ఆ పార్టీ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు తెలిపారు. కల్లూరులో బుధవారం పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు, యువ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాదాస్‌లోకేష్, నియోజకవర్గ కన్వీనర్ మదన్ మోహన్ పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల శిబిరం రేపు


మాట్లాడుతున్న ఆర్డీఓ భవాని

పుంగనూరు: పట్టణంలోని బసవరాజ హైస్కూల్‌లో ఈనెల 21న విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల ఉపకరణాల నమోదు శిబిరం నిర్వహిస్తున్నట్లు పలమనేరు ఆర్డీఓ భవాని తెలిపారు. గురువారం ఆమె తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ భారత ప్రభుత్వ సంస్థ ఏఎల్ఐఎంసీఓ ద్వారా శిబిరం నిర్వహించి, అవసరమైన వారికి ఉపకరణాల కోసం నమోదు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. శిబిరంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు పాల్గొని తమకు అవసరమైన పరికరాలను నమోదు చేసుకోవాలని కోరారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తత


అవగాహన కల్పిస్తున్న కాంతమ్మ

బైరెడ్డిపల్లె: సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని తీర్థం పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ అన్నారు. తీర్థం ప్రాథమిక పాఠశాలలో గురువారం ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి


శిక్షణలో ప్రజాప్రతినిధులు, అధికారులు

పెద్దపంజాణి: పంచాయతీల్లో అభివృద్ధి లక్ష్యాల సాధనే ధ్యేయంగా ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఈఓపీఆర్డీ శారదాదేవి కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్‌లో భాగంగా సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హేమలత, వెలుగు ఏపీఎం మీరాబాయి, సీహెచ్‌ఓ కరుణాకర్ పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాల తనిఖీ


సీహెచ్‌సీ తనిఖీ చేస్తున్న వెంకటప్రసాద్

సదుం: మండల కేంద్రంలోని సీహెచ్‌సీతో పాటు చెరుకువారిపల్లె పీహెచ్‌సీ, నడిగడ్డ ఆరోగ్య కేంద్రాలను అడిషినల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటప్రసాద్ తనిఖీ చేశారు. టీబీ, కుష్ఠు, హెచ్ఐవీ రోగులకు చేస్తున్న పరీక్షలు, అందిస్తున్న వైద్యసేవలను ఆరా తీశారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. వైద్యులు పుష్పకుమారి, రూపానంద్, గిరీషా, హెచ్ఈఓ ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు


వీధిని శుభ్రం చేయిస్తున్న మలేరియా అధికారి

గంగవరం: ప్రాణాంతక వ్యాధుల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి జయశంకర్ తెలిపారు. మండలంలోని కలగటూరు గ్రామంలో ఒక డెంగీ కేసు నమోదైన విషయాన్ని తెలుసుకున్న ఆయన వైద్యసిబ్బందితో కలసి గ్రామంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. వీధుల్లో పారిశుద్ధ్య సమస్య కారణంగానే వ్యాధులు ప్రబలుతున్నట్లు గ్రహించిన ఆయన వెంటనే వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని శుభ్రం చేయించారు. అనంతరం గ్రామంలో లార్వా సర్వే చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బ్రాహ్మణపల్లిలో ఫ్యామిలీ డాక్టర్


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మురళి

పెద్దపంజాణి: బ్రాహ్మణపల్లిలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. పెద్దపంజాణి పీహెచ్‌సీ వైద్యాధికారి టి.మురళి రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులకు గురైన రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి వైద్యసేవలు అందించారు. ఎంఎల్‌హెచ్‌పీ ధనలక్ష్మి, ఏఎన్ఎం రెడ్డెమ్మ, ఆశావర్కర్లు వసంత, అరుణ, శశికళ పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలకు చేయూత అందిస్తాం


నగదు వితరణ చేస్తున్న బాలగురునాథ్

వి.కోట: ప్రత్యేక ప్రతిభావంతుల పాఠశాల విద్యార్థులకు తమవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలగురునాథ్ అన్నారు. గురువారం ఆయన తన 55 వ జన్మదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని సాయిగార్డెన్‌లోని ప్రత్యేక ప్రతిభావంతుల ఆదర్శ పాఠశాలలో పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. పాఠశాల నిర్వాహణకు తన వంతు సాయంగా పాఠశాల నిర్వాహకురాలు భార్గవికి రూ.12వేలు నగదు వితరణ చేశారు. పూలనాగ, వేణుఆచ్చారి, మురళి, రమేష్, సతీష్, చలపతి పాల్గొన్నారు.

వరసిద్ధునికి విరాళం


విరాళం అందజేస్తున్న దాత

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన అభివృద్ధికి ఓదాత గురువారం నగదు విరాళంగా అంద జేశారు. హైదరాబాద్‌కు చెందిన విద్యాసాగర్‌రెడ్డి రూ.లక్ష నగదును ఆలయ అభివృద్ధికి అందజేశారు. ఆయనకు ఆలయ అధికారులు దర్శనం కల్పించి స్వామి ప్రసాదం అందజేశారు. సిబ్బంది బాలాజీనాయుడు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో 22 అర్జీలు

పెద్దపంజాణి: మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసమే సదస్సులు నిర్వహిస్తున్నామని ఆర్ఎస్ డీటీ రమేష్‌బాబు అన్నారు. గురువారం తుర్లపల్లి పంచాయతీలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరయ్యారు. సదస్సులో 22 మంది రెవెన్యూ సమస్యలను అర్జీల రూపంలో ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సాయిరాజ్, ఆర్ఐ రాకేష్, వీఆర్వో సుబ్రమణ్యంఆచారి పాల్గొన్నారు.

ఆమినిగుంటలో 26 అర్జీలు..

చౌడేపల్లె: మండలంలోని ఆమినిగుంటలో జరిగిన రెవెన్యూ సదస్సులో 26 మంది రైతుల నుంచి అర్జీలు స్వీకరించినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ మాధవి తెలిపారు. సమస్యలను రికార్డుల ఆధారంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని ఈసందర్భంగా తెలిపారు.

దివ్యాంగుడికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న ఇర్షాద్

రొంపిచెర్ల: తిరుపతికి చెందిన దివ్యాంగుడికి రొంపిచెర్ల దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు ఇర్షాద్ ఆర్థిక సాయం అందజేశారు. తిరుపతిలో టైలర్ పనిచేస్తున్న దివ్యాంగుడు నానా సాహెబ్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. మనవరాలికి వివాహం చేయడానికి ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని మండల దివ్యాంగుల సంఘాన్ని కోరాడు. దీంతో మండల అధ్యక్షుడు ఇర్షాద్ తన వంతుగా రూ.5,300 అందజేశాడు. దివ్యాంగుల సంఘం నాయకులు మహ్మదాలీ, మహబూబ్‌బాషా, అజంతుల్లా, సైదుల్లా పాల్గొన్నారు.

తిరుమలకు కాలి నడకన భక్తులు


శెట్టిపేట ఆలయం వద్ద గోవింద మాలధారణతో భక్తులు

చౌడేపల్లె: మండలంలోని శెట్టిపేట పంచాయతీ పరిధిలోని ప్రజలు భక్తి శ్రద్ధలతో 40 రోజులపాటు గోవిందమాలధారణ ధరించి ఇరుముడి కట్టుకుని గురువారం పాదయాత్రగా బయలుదేరారు. శెట్టిపేట సమీపంలోని వినాయకస్వామి ఆలయంలో 70 మందికి ప్రధాన అర్చకుడు ఆనందాచార్యులతో ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. గోవింద నామస్మరణలతో ఆలయం మారుమోగింది. మూడు రోజుల పాదయాత్రలో భక్తులకు భోజన సదుపాయాన్ని ధాత లక్ష్మణరాజు సమకూర్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కుప్పం విద్యార్థుల ప్రతిభ


విద్యార్థినులను అభినందిస్తున్న అధ్యాపకులు

కుప్పంరూరల్: ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ బాలికల విభాగంలో కుప్పం ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థినులు రెండు బహుమతులు సాధించినట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ సీహెచ్ సుబ్బన్న అన్నారు. పలమనేరులో జరిగిన పోటీల్లో డిస్కస్ త్రోలో నిహారిక 3వ బహుమతి, 100 మీటర్ల పరుగు పందెంలో స్ఫూర్తి 2వ బహుమతి సాధించినట్లు ఆయన చెప్పారు. వీరిద్దరిని గురువారం కళాశాల అధ్యాపక బృందం ప్రశంసాపత్రాలతో ప్రశంసించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ సుబ్బన్న, శ్రీనివాసులు, జీఎస్ రమేష్, జ్యోత్స్న, అధ్యాపకులు ఉన్నారు.

ఇంత తక్కువేంటి శివయ్యా!

- గంగవరంలో ఆలయ భూముల కౌలు రూ.67వేలే!
- 18 సెంట్ల నంజ భూమిపై కోర్టు ఆదేశాలతో ఆగిన వేలం
- వేలంలో పెట్టాల్సిందేనన్న కూటమి నేతలు
- నిబంధనలు పాటించాలన్న ఎండోమెంట్ అధికారులు


వేలంపాట నిర్వహిస్తున్న ఎండోమెంట్ అధికారులు

పలమనేరు: ఎవరికైనా దేవుడంటే భయం, భక్తి ఉంటుంది. కానీ అదే దేవుని ఆస్తి ద్వారా నాలుగు రూపాయలు ఎక్కువ చేసి ఆలయాభివృద్ధికి కృషిచేయాలంటే మాత్రం మనసొప్పదేమో. పలమనేరు శివాలయానికి చెందిన ఆస్తుల మూడేళ్ల కౌలు బహిరంగ వేలం శివాలయంలో గురువారం జరిగింది. ఇక్కడ జరిగిన వేలం ప్రక్రియను చూస్తే శివాలయ అభివృద్ధికన్నా తమమాటే నెగ్గాలన్న కూటమి నేతల ఆవేశం కనిపించింది. ఆమేరకు ఎండోమెంట్ ఉన్నతాధికారుల ద్వారా ఇక్కడ గంగవరం మండలంలోని స్వామివారి ఆస్తులైన సర్వే నంబర్లు 422/8లో 39 సెంట్లు, 452/4లో 82సెంట్లు, 457లో 2.40 ఎకరాలు మూడేళ్ల కౌలుకు సంబంధించి ఆలయానికి దక్కిన వేలం రూ.67వేలు మాత్రమే. దీన్ని చూసి స్థానికులు సైతం ఇదేంది శివయ్యా మరీ ఇంత చౌకగా కౌలు కిచ్చారా అనే మాట వినిపించింది. వేలంలో పాల్గొన్న వారిలో కూటమి నేతలే వేలం పాటదారులుగా మారడంతో ఎండోమెంట్ అధికారులు సైతం ఏం చేయలేని పరిస్థితి నెలకొంది. ఇలా ఉండగా ఆలయానికి సంబంధించి పట్టణంలోని మదనపల్లి రోడ్డులో సర్వే నం:467లో 18 సెంట్ల స్థలానికి సంబంధించి వేలాన్ని ఇప్పుడే వేయాలంటూ కొందరు వేలంపాటదారులు ప్రశ్నించారు. అయితే గతంలో వేలంపాటలో దాన్ని దక్కించుకున్న వేలంపాటదారు భారీగా ఖర్చుచేసి అభివృద్ధి చేశానని దీనిపై తాను పెట్టిన పెట్టుబడి దక్కాలంటే తనకు మరో మూడేళ్ల అవకాశం కల్పించాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. దీంతో అధికారులు ఆమేరకు న్యాయస్థానాల మాట వినాల్సిందేనని, లేదంటే కోర్టు ధిక్కరణ కింద తమకు సమస్యలు తప్పవని వేలంపాటదారులకు సూచించారు. మీరు కావాలనే వేలంపాటను ఆలస్యం చేశారని కొందరు ఎండోమెంట్ అధికారులను నిలదీయడంతో సమస్య తలెత్తింది. ఎట్టకేలకు మరో తేదీలో ఆ స్థలాన్ని సైతం వేలం నిర్వహిస్తామని ఈఓ కమలాకర్ సూచించడంతో సమస్య సద్దుమణిగింది. ఏదేమైనా శివునికి ఆదాయం కలిగే భూముల కౌలు ఈ దఫా తక్కువగా రావడంపై పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తుండడం కొసమెరుపు.

స్థానికులకే కేటాయించండి!

- స్థానికేతరులను ప్రోత్సహించొద్దు
- టీడీపీ నేతల టెలీ కాన్ఫరెన్స్‌లో చంద్రబాబు

కుప్పం: నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో కాంట్రాక్టులన్నీ స్థానిక నేతలకే కేటాయించాలని తమ్ముళ్లను చంద్రబాబు ఆదేశించారు. రెండు రోజుల క్రితం కుప్పం నియోజకవర్గ టీడీపీ నేతలతో టెలీ కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణం కాంట్రాక్టులను బయటి వ్యక్తులకు కేటాయిస్తున్నారని టీడీపీ కార్యకర్తలు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన సీరియస్ అయినట్లు సమాచారం. బయటి వ్యక్తులకు కాంట్రాక్టు పనులు ఇచ్చి రాబోయే ఎన్నికల్లో నాకు మెజారిటీ తెప్పిస్తారా అంటూ మండిపడినట్లు తెలిసింది. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులతో పాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాల పనుల కాంట్రాక్టులను కేటాయించినట్లు సూచించినట్లు సమాచారం. అక్రమవ్యాపారాల జోలికి వెళ్లొద్దంటూ క్యాడర్‌ను హెచ్చరించినట్లు సమాచారం. అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించాలనిసూచించారు. కుప్పం నియోజకవర్గం అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పార్టీ క్రమశిక్షణలోనూ ఆదర్శంగా ఉండాలని, క్రమశిక్షణ తప్పితే పార్టీపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పరీక్షల విధానంలో అసంబద్ధ విధానాలు

చిత్తూరు కలెక్టరేట్: కూటమి ప్రభుత్వం పరీక్షల విధానంలో అమలు చేస్తున్న అసంబద్ధ విధానాలను రద్దు చేయాలని ఫ్యాప్టో సంఘ నాయకులు గంటామోహన్, చెంగల్‌రాయమందడి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు పూతలపట్టులో రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటనపై గురువారం డీఈఓ వరలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ గురువారం నిర్వహించాల్సిన సమ్మేటివ్ –1 ప్రశ్నపత్రాలను తీసుకెళుతూ ప్రమాదంలో మృతిచెందిన సిద్ధశెట్టికి ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. ఈ ఘటన చాలా బాధాకరమన్నారు. సమ్మేటివ్ ప్రశ్నపత్రాలను పోలీస్‌స్టేషన్‌లో భద్రపరచడం, రోజు రెండు సార్లు దూరప్రాంతాలకు తీసుకెళ్లడం చాలా కష్టతరమన్నారు. పరీక్షల నిర్వహణపై క్షేత్రస్థాయిలో అభిప్రాయాలు, ఇబ్బందులు పరిగణనలోకి తీసుకోకుండా నూతన విధానాలు అమలు చేయడం చాలా దారుణమని ఆయన అన్నారు. వెంటనే సిద్ధయ్య కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో సంఘ నాయకులు మదన్‌మోహన్‌రెడ్డి, భాస్కరరావు, ముక్తార్ అహ్మద్, తులసిబాబు, సారథి, రాజేంద్రన్, సురేష్ పాల్గొన్నారు.